స్మార్ట్ స్కూల్



ఎన్జీజీవోస్ కాలనీలో కొత్తగా నిర్మించిన జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల భవనం

- కార్పొరేట్‌ను తలదన్నేలా ఎన్జీజీవోస్ కాలనీ ప్రాథమిక పాఠశాల
- రూ.1.96 కోట్లతో అభివృద్ధి పనులు
- లెర్నింగ్ బేస్డ్ స్కూల్ క్యాంపస్
- ప్రారంభానికి సిద్ధంగా అదనపు భవనం


సీతంపేట: కార్పొరేట్ స్కూల్స్‌లో సైతం లేని సదుపాయాలను ప్రభుత్వ బడుల్లో కల్పించారు. సాదా సీదాగా ఉండే ఉండే జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలు అత్యాధునిక వసతులతో స్మార్ట్‌గా మారిపోయాయి. స్కూల్ అంటే ఇలానే ఉండాలనేలా వాటిని తీర్చిదిద్దారు. 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలే ఇందుకు నిదర్శనం. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, సిటీస్ ప్రోగ్రాం కింద రూ.1.96 కోట్ల నిధులతో ఈ స్కూల్‌ను అభివృద్ధి చేశారు. అదనపు భవనం, మౌలిక సదుపాయాలు కల్పించారు. అదనపు భవన నిర్మాణం, పాత భవనం అభివృద్ధికి గతేడాది సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తికావడంతో త్వరలోనే వీటిని ప్రారంభించనున్నారు.

విద్యార్థుల కోసం అనేక సదుపాయాలు

పాఠశాల పరిసరాల నుంచి విద్యార్థులు పలు విషయాలను నేర్చుకునేలా ఆవరణాన్ని చక్కగా తీర్చిదిద్దారు. ఇందులో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్ట్, క్రాప్స్ టు క్లాస్ రూమ్, ఫ్రిజర్వ్ వంటి సదుపాయాలు కల్పించారు. రిక్రియేషన్ కోసం సురక్షిత బహిరంగ ఆట స్థలాలు, ఆట పరికరాలు, నేచర్ బేస్డ్ లెర్నింగ్, ట్రాఫిక్ రూల్స్, పర్యావరణ పరిరక్షణ–క్రాప్ ఏరియాలో మొక్కల పెంపకం, ఆరుబయట కూర్చునేలా సిట్ అవుట్స్, ఆర్వో వాటర్, మెరుగుపర్చిన టాయిలెట్లు, హ్యాండ్ వాష్, వేస్ట్ బిన్స్ ఇలా విద్యార్థులకు మంచి అలవాట్లు నేర్పేలా పాఠశాలను ఆకర్షణీయంగా మలిచారు.

సరికొత్తగా పాఠశాల భవనాలు

పాత భవనాన్ని ఆధునికీకరించారు. కొత్తగా నిర్మిస్తున్న అదనపు భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు తరగతి గదులు, రెండు టాయిలెట్లు, పై అంతస్తులో మూడు తరగతి గదులు నిర్మించారు. తరగతి గదుల్లో పిల్లలు కూర్చోడానికి అవసరమైన ఫర్నిచర్, బ్లాక్ బోర్డులు, నోటీస్ బోర్డులు, స్టోరేజీ యూనిస్లు, టాయిలెట్లకు నిరంతర నీటి సరఫరా, తాగునీటి సదుపాయం కల్పించారు. గ్రౌండ్‌లో సెమీ ఓపెన్ డైనింగ్ హాల్, కమ్ స్టేజీ, వాలీబాల్ కోర్టు, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు అనుగుణంగా లెర్నింగ్ టైల్స్, స్కేల్, అబాకస్, స్నేక్స్ అండ్ లేడర్స్, పాత్ వే పక్కన స్లైడింగ్ గేమ్స్‌తో ఆట స్థలాన్ని అభివృద్ధి చేశారు. చిన్న చిన్న ఫినిషింగ్ పనులు మినహా అన్నీ పూర్తయ్యాయని, రెండు వారాల్లో పాఠశాల కొత్త భవనాన్ని ప్రారంభించే అవకాశముందని ఉపాధ్యాయులు తెలిపారు.



పర్యావరణ పరిరక్షణపై అవగాహనకు వాల్ పెయింటింగ్



మొక్కలు పెంచడానికి క్రాప్ ఏరియా

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



55వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ శశికళ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెం సాక్షి గణపతి ఆలయం వీధిలో పలు అభివృద్ధి పనులకు సోమవారం కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. రూ.56.21 లక్షల జీవీఎంసీ నిధులతో తాటిచెట్లపాలెంలో బీటీ రోడ్డు, సీసీ రోడ్లు, మేజర్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, కేపీ రత్నాకర్, బొడ్డేటి గంగామహేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాసరెడ్డి, ఆళ్ల గోపి, లక్ష్మీ, నాగలక్ష్మి, వరలక్ష్మి, నాగ, పద్మప్రియ, బద్రి, జి.శ్రీనివాస్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, పవన్ రెడ్డి, సీనియర్ నాయకులు, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వేలాడుతున్న సిగ్నల్ లైట్



సత్యం జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద వేలాడుతున్న లైట్

సీతమ్మధార: జాతీయ రహదారిపై సత్యం జంక్షన్‌లో సిగ్నల్ లైట్ ప్రమాదకరంగా మారింది. నెల రోజులుగా లైట్ పాడైపోయి వేలాడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. పొరపాటున లైట్ పడిపోతే ప్రయాణికులు ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. సంబంధిత అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపు



నక్కవానిపాలెంలో రహదారి ఆక్రమణను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం 24వ వార్డు పరిధి సత్యం జంక్షన్ నుంచి నక్కవానిపాలెం, అల్లూరి సీతారామరాజు కూడలి, హెచ్‌బీ కాలనీ వరకు పలు ఆక్రమణలు తొలగించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీపీ నేతృత్వంలో ఏసీపీ శాస్త్రి ఆధ్వర్యంలో టీపీవో తేజ పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. రోడ్డు పైకి ఉన్న భవన నిర్మాణాలను, రహదారుల పక్కనున్న బడ్డీలు, తోపుడు బండ్లను, అనధికార ప్రకటన బోర్డులను తొలగించారు. కార్యక్రమంలో చైన్‌మెన్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

8న శ్రావణలక్ష్మి ఉచిత పూజలు

దాబాగార్డెన్స్: శ్రావణమాసం సందర్భంగా ఏటా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో నిర్వహించే ఉచిత సామూహిక శ్రావణలక్ష్మి పూజలు(వరలక్ష్మీ వ్రతాలు) ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనదలిచే మహిళలు ఈ నెల 7వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు ఆసక్తి గలవారు దేవస్థానం కార్యాలయంలో లభించే దరఖాస్తులను పూర్తి చేసి అందజేయాలని కోరారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు కలశ చెంబు, ఆచమనం కోసం గ్లాసు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారు సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 6 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 3, యూసీడీకి 1, రెవెన్యూకు 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

జెడ్సీతో ట్రాఫిక్ సీఐ చర్చ

జోన్-5 కమిషనర్ కృష్ణతో కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు సమావేశమయ్యారు. జోన్-5 పరిధిలోని రహదారులపై ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించి ఏర్పాటు చేస్తున్న జీబ్రా క్రాసింగ్ లైన్లు, స్పీడ్ బ్రేకర్లు, ఫుట్‌పాత్‌లకు రంగులు తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సహకారం అందించాలని ఆయనను సీఐ కోరారు. కార్యక్రమంలో జోన్ సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎస్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, టీపీఆర్‌వో ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 14 అర్జీలు

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 14 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి, పరిశీలించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ సభ్యుల పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలువురు వార్డుల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ పెంచిన కరెంట్ చార్జీలు, నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రూ.400కే గ్యాస్ సిలెండర్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శి అప్పలరాజు, రాజు, ఐద్వా నాయకురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలి



దేవులపల్లి పద్మజ, కశిరెడ్డి వెంకటరావు, వెన్నెల సూర్యానారాయణలను సత్కరిస్తున్న డిస్ట్రిక్ట్-101 గవర్నర్ శుభ, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు జయప్రభాశర్మ, సభ్యులు

- కవయిత్రి దేవులపల్లి పద్మజ
- ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

మురళీనగర్: పిల్లల్లో నైతిక విలువలు పెంపొందేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కవయిత్రి, సెయింట్ జోసెఫ్ వుమన్స్ కాలేజీ లెక్చరర్ దేవులపల్లి పద్మజ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు విశ్వనాథ జయప్రభాశర్మ అధ్యక్షతన వైశాఖి మహిళా భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ నేటి బాలబాలికలను పెద్దల పట్ల గౌరవ భావాలు ప్రకటించేలా పెంచాలని సూచించారు. ప్రతి ఇంట్లో మాతృభాషలో మాట్లాడాలని, తెలుగు గొప్పదనాన్ని పిల్లలకు చెప్పాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెన్నెల సూర్యనారాయణ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక పరిపక్వతకు ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, రాంపురం బాలికల జూనియర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్(పీజీటీ) కశిరెడ్డి వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులకు దేశ సంస్కృతీ సంప్రదాయాల ప్రాధాన్యాన్ని తెలియజేయాలన్నారు. తెలుగుతోపాటు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా దేవులపల్లి పద్మజ, కశిరెడ్డి వెంకటరావు, వెన్నెల సూర్యానారాయణ మాస్టార్లను వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. అనంతరం క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించి ఈ నెలలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న సభ్యులకు చిరు కానుకలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎస్.రోజారాణి, కోశాధికారి జి.శీలారాణి, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి 11 కేవీ ఏఎస్సార్ నగర్, 11 కేవీ ఏపీ ఎస్ఈబీ ఫీడర్ ప్రాంతాల్లో చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్, మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరా యం ఉంటుందని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్, సబ్బం హరి నివాసం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మహాశివుడికి రుద్రాభిషేకం



కోదండేశ్వరాలయంలో రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ పంచమి సందర్భంగా సోమవారం స్థానిక శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కంచరపాలెం మెయిన్ రోడ్డులోని గౌరీశంకరాలయంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, మర్రిపాలెం 104 ఏరియా బాపూజీనగర్ కోదండేశ్వరాలయంలో అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రధాన అర్చకులు ఎం.సూర్యప్రకాశ్ శర్మ, ఆంజనేయ శర్మ మహాశివుడికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం విభూధి అభిషేకం, బిల్వార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కస్తూరినగర్‌లో చోరీ

- 3 తులాల బంగారం, 18 తులాల వెండి అపహరణ

తాటిచెట్లపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం కస్తూరినగర్-1లో కె.లక్ష్మి అనే మహిళ తన కుమారుడితో కలిసి నివసిస్తోంది. ఈ నెల 2న ఎన్జీజీవోస్ కాలనీలోని తన కుమార్తె ఇంటికి ఈమె వెళ్లింది. తన కుమారుడు ఆదివారం రాత్రి తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వెచ్చి చూసేసరికి ఇంటి తాళం తీసి బీరువాలోని సుమారు 3 తులాల బంగారం, 18 తులాల వెండి అపహరణకు గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం సీఐ ఎన్.సాయి నేతృత్వంలో క్రైం ఎస్ఐ సునీల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆళ్ల శివగణేష్ మిత్రమండలి సేవా కార్యక్రమాలు



తాటిచెట్లపాలెంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ జన్మదిన వేడుకలను ఆళ్ల శివగణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. తాటిచెట్లపాలెం సాక్షిగణపతి ఆలయం వీధిలోని శివగణేష్ ఇంటి వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. అనంతరం రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం వద్ద వృద్ధులు, యాచకులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం జగన్నాథపురంలోని ప్రియదర్శిని ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. సాయంత్రం ఆళ్ల శివగణేష్ నివాసం వద్ద 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేశారు. కార్యక్రమాల్లో 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ, గాలి ప్రసాద్, బోర పరదేశిరెడ్డి, ఎస్‌కే ఖాజా, ఆళ్ల నరసింగరావు, ఆళ్ల గోపి, ఆళ్ల శ్రీనివాస్, పార్టీ 42వ వార్డు నాయకులు కె.రమణమూర్తి, బొడ్డేటి వెంకటరావు, మొల్లేటి జగన్, ఆళ్ల దినేష్, పి.చందన్‌సాయి, తేజ, భార్గవ్, ఆళ్ల శివగణేష్ మిత్ర మండలి సభ్యులు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

వేగవంతంగా పార్కుల ఆధునికీకరణ



శివాజీ పార్కులో ఫౌంటైన్ పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: నగరంలో చేపడుతున్న పార్కుల ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం జోన్-3 పరిధిలో శివాజీ పార్కు తదితర పార్కుల ఆధునికీకరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివాజీ పార్కులో చేపడుతున్న ఆధునికీకరణ పనుల్లో వాటర్ ఫౌంటైన్, పెయింటింగ్, లైటింగ్, పచ్చదనం పెంపొందించడం, సందర్శకులు కూర్చునే బల్లల ఏర్పాటు, తాగునీరు, మరుగుదొడ్లు, క్యాంటీన్ వంటి పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పార్కులో పారిశుద్ధ్యం సరిగ్గా నిర్వహించడం లేదని, తాగునీరు, వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేవని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆధునీకరణ పనులు చేపడతున్నామని, పూర్తయిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని బదులిచ్చారు.

నైపుణ్యం గల మానవ వనరులతో ఆక్వారంగం అభివృద్ధి



కోర్సు మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: నైపుణ్యం గల మానవ వనరులను సుసంపన్నం చేయడం వల్ల ఆక్వారంగం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ-అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం 'రొయ్యల పెంపకంలో మెరుగైన యాజమాన్య విధానాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న రంగాలలో ఆక్వారంగం ఒకటిగా నిలుస్తూ దేశానికి విదేశీ మారకాన్ని ఆర్జిస్తోందన్నారు. అదే సమయంలో ఈ రంగాన్ని అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, నాణ్యతను నిలుపుకోవడం, విత్తనం నుంచి పెంపకం వరకు, ఆహారం వంటివి ఎంతో జాగ్రత్తలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం మాట్లాడుతూ ఈకార్యక్రమంలో ప్రత్యక్ష శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఏయూతో అవంతి ఫౌండేషన్ చేసుకున్న ఎంవోయూలో భాగంగా ప్రపంచ స్థాయి మౌలిక వసతులను కల్పించి మంచి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఏయూ-అవంతి ఏఎస్‌డీసీ డైరెక్టర్ డాక్టర్ ఏ.కె రెడ్డి మాట్లాడుతూ అవంతి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ ఆలోచనలకు ప్రతిరూపంగా నైపుణ్య శిక్షణ కేంద్రం నిలుస్తుందన్నారు. ఏయూ-అవంతి ఏఎస్‌డీసీ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె.ఫణి ప్రకాష్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి 16వ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 20 మంది బీఎఫ్ఎస్సీ, ఎంఎస్సీ, బీఎస్సీ విద్యార్హత కలిగిన వారు తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఏపీ నుంచి శిక్షణకు హాజరవుతున్నట్టు చెప్పారు. 13 రోజులు థియరీ, 17 రోజుల పాటు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ రామచంద్ర గణేష్, డాక్టర్ డి.సునీల్ కుమార్, సీహెచ్ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్సు మెటీరియల్‌ను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు.

సకాలంలో ఓటర్ల సర్వే పూర్తి చేయాలి

ఆరిలోవ: ఇంటింటి ఓటర్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని బీఎల్‌వోలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. జీవీఎంసీ పదో వార్డులోని 67, 68 పోలింగ్ కేంద్రాలను సోమవారం జేసీ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలించారు. ఓటర్లతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. సర్వే జరుపుతున్న బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన బీఎల్‌వోలకు పలు సూచనలిచ్చారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను పూర్తి సమాచారంతో రిజిస్ట్రేషన్ ద్వారా రికార్డుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు.